నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
1
శనివారం | జూన్ 01, 2024 | www.navatelangana.com

లక్కిరెడ్డి అనూషకు రాయితీపై లాప్‌టాప్ అందజేత

నవతెలంగాణ-వైరాటౌన్

విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా లయన్స్ క్లబ్ వైరా కృషి చేస్తోందని, పలువురు విద్యార్థులకు రాయితీపై లాప్టాప్స్ అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అధ్యక్షతన స్థానిక మురళీకృష్ణ హాస్పిటల్ నందు డాక్టర్ కాపా చంద్రకళ పుట్టినరోజు సందర్భంగా బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న కోమట్లగుడానికి చెందిన లక్కిరెడ్డి అనూషకు రాయితీపై లాప్టాప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంటి కోఆర్డినేటర్ యు.శ్యాంబాబు, రీజన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, డాక్టర్ కాపా చంద్రకళ, క్లబ్ కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, రాయపూడి వెంకటేష్ పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

వైరాకు చెందిన వాంకుడోత్ శ్రీనివాస్ సతీమణి ఆరోగ్య సమస్య కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. విషయం తెలుసుకున్న వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ 1996-1998 బ్యాచ్ మిత్రులు గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు శ్రీనివాసరావు, కొండలరావు, అఫ్జల్, కృష్ణయ్య శేషగిరి, రఫీ, సీతారాములు, వెంకట్ పాల్గొన్నారు.



పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు...

- సిగరేట్ బొమ్మ దహనం

నవతెలంగాణ-ఖమ్మం

పొగాకు వద్దు ఆరోగ్యమే ముద్దంటు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ సభ్యులు ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో వినూత్నంగా సిగిరేట్ బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ రాకం శ్యామ్ బాబు మాట్లాడారు. అనంతరం వాకర్స్ సభ్యులు, క్రీడాకారులు, యూత్ కలసి సిగరెట్ బొమ్మపై సంతకాలు చేసి పొగాకును వ్యతిరేకిస్తున్నట్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కొండమీది వెంకట్, సభ్యులు శౌంతి వెంకట్, కార్మిక నేత మందా వెంకటేశ్వర్లు తాళ్లూరి వేణు, వెంకట్ బాబు, విజయకుమార్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నిజ నిర్ధారణ బృందానికి అడుగడుగున ఆటంకాలను ఖండించండి

నవతెలంగాణ-బోనకల్

మే 30న 52మందితో కూడిన నిజనిర్ధారణ బృందం ఛత్తీస్ ఘడ్‌లోని దండకారణ్యానికి వెళ్లేందుకు బయలుదేరింది. తెలంగాణ నుండి కుంట మార్గంలో పోతుండగా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కుంట వద్ద సీఆర్పిఎఫ్ నిజ నిర్ధారణ బృంద వాహనాన్ని అడ్డుకుంది. ఈ వాహనంతో పాటు అటుగా పోతున్న వందలాది వాహనాలను నిలిపివేసింది. పైన మావోయిస్టుల బంద్ జరుగుతోందనీ, అటుగా వెళ్ళే వాహనాల భద్రత దృష్ట్యా ఆపివేస్తున్నామనీ చెప్పి ప్రయాణికుల్లో గందరగోళాన్ని సృష్టించారని ఈ చర్యను సీపీఐ న్యూ డెమోక్రసీ ఖండిస్తుందని జిల్లా నాయకులు ఎం.గిరి తెలిపారు. ఈ చర్యను మేధావులు, జర్నలిస్టులు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఎలాగైనా ఛత్తీస్ గఢ్‌లోకి పోవాలని మరో దారిని ఎంచుకోవడం జరిగిందన్నారు. 30వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో మళ్ళీ ఛత్తీస్ ఘడ్ బీజాపూర్‌కు 40 కి.మీ దూరంలో తెరగూడ వద్ద సీఆర్పిఎఫ్ నిజనిర్ధారణ బృందాన్ని ఆపేసిందన్నారు. పైన మావోయిస్టులతో ఎన్ కౌంటర్ జరుగుతోందని, వెళ్ళటానికి వీలు లేదని మరో కట్టుకథ అల్లారని విమర్శించారు. నిరసనగా బృందం రోడ్డుపై బైఠాయించిందని తెలిపారు.

గుర్తింపు లేని కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాలను గుర్తించండి

- ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి

నవతెలంగాణ-ఖమ్మం

గుర్తింపు లేని ప్రయివేట్ పాఠశాలలను గుర్తించి సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మకు వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని, నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్ట్ పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు మధు శివ, అయ్యప్ప, నరేష్, గోపి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే వరకూ పోరాటం ఆగదు

- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసేంత వరకూ ఏఐటీయూసీ చేసే పోరాటం ఆగబోదని ఏఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. శుక్రవారం గిరిప్రసాద్ భవన్ లో రెండవ ఏఎన్ఎంల జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో 15, 7000 మంది రెండవ ఏఎన్ఎంలు ఉన్నారని, రాష్ట్రంలో ఉన్న 6,000 మంది ఏఎన్ఎంల పనితో పోల్చుకుంటే మిగిలిన వాళ్ళ పని చాలా తక్కువ ఉన్నారని, రోజుకు 10 నుండి 12 గంటలపాటు ఏకధాటిగా పనిచేస్తున్నదని, రెండవ ఏఎన్ఎం లేనన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 16లో రెండవ ఏఎన్ఎంలను కూడా చేర్చి వీరిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సదస్సులో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహా రావు, రెండో ఏఎన్ఎం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి హేమలత, జిల్లా నాయకురాలు సునీత, నాగమణి, కృష్ణవేణి, రాజేశ్వరి, విజయలక్ష్మి, శైలజ, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని ప్రయివేట్ స్కూల్ బస్సులకు సర్టిఫికెట్ జారీచేయవద్దు

- డీటీవో అఫ్రీన్ సిద్ధిక్‌కి వినతి

నవతెలంగాణ-ఖమ్మం

ఫిట్నెస్ లేని ప్రయివేట్ స్కూల్ బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేయవద్దని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీటీవో అఫ్రీన్ సిద్ధిక్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మే 15లోగా స్కూల్ బస్సులకు ఫిట్ నెస్ చేయించాల్సినా స్కూల్స్ యాజమాన్యం గడువు దాటినప్పటికి పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించని పరిస్థితి జిల్లా కనిపిస్తుందని అన్నారు. దానికి ఉదాహరణ జిల్లా వ్యాప్తంగా 648 స్కూల్ బస్సులు ఉంటే దాంట్లో ఫిట్నెస్ ఉన్న 121 అయితే ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందిన బస్సులు కేవలం 15 మాత్రమే ఉన్నాయని అన్నారు. ఫిట్నెస్ లేని బస్సు లకు సర్టిఫికెట్ జారీచేయవద్దని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు తిప్పరపు లక్ష్మణ్, నాయకులు కరుణ్, స్టాలిన్, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితులు రిమాండ్



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఎస్ఆర్. గార్డెన్స్ పరిసర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నలుగురు నిందితుల నుండి 460 గ్రాముల ఎండు గంజాయి స్వాదీనం చేసుకున్నట్లు ఖమ్మం వన్ టౌన్ ఎక్సైజ్ సీఐ బి. కృష్ణ తెలిపారు. వివరాలు ఎలా ఉన్నాయి. ఖమ్మం నిజాంపేట చెందిన గుత్తికొండ యశ్వంత్, తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన చింతినేని విజేంద్ర ప్రసాద్, ఖమ్మం పాండురంగాపురం చెందిన షేక్ అమీర్, డోర్నకల్ కు చెందిన తేజావత్ నితిన్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సైలు ఎస్. జయశ్రీ, కె.సాయి బాబా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా 'బోనకల్' ఎంపిక

- సర్పంచ్, కార్యదర్శి కృషికి దక్కిన ఫలితం

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా వ్యాప్తంగా 589 పంచాయతీలకు గాను 9 గ్రామపంచాయతీలను వివిధ విభాగాల కింద ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపిక చేసినట్లు బోనకల్ గ్రామపంచాయతీకి జిల్లా అధికారుల నుంచి గురువారం ఆదేశాలు అందాయి. బోనకల్ గ్రామపంచాయతీని మౌలిక వసతుల కల్పనకు గాను ఉత్తమ పంచాయతీగా అధికారులు ఎంపిక చేశారు.



వైకుంఠధామం లో ఏర్పాటుచేసిన శివుడి విగ్రహం(ఫైల్)



వైకుంఠధామం లో ఏర్పాటుచేసిన బల్లలు



కమ్యూనిటీ టాయిలెట్స్

మౌలిక వసతులు కల్పించడంలో తాజా మాజీ సర్పంచ్ భూక్య సైదా నాయక్, పంచాయతీ కార్యదర్శి దామల్ల కిరణ్ విశేషమైన కషి చేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కావటంలో పలు అంశాలను అధికారులు పరిగణలోకి తీసుకొని ఎంపిక చేశారు. ఇందులో ప్రధానంగా వైకుంఠధామం, కంపోస్ట్ షెడ్డు, రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, గ్రామంలో సీసీ రోడ్లు, ఆర్ అండ్ బి బ్రిడ్జి కింద పనులు, కమ్యూనిటీ టాయిలెట్స్ వంటి అనేక మౌలిక వసతులను కల్పించారు. గతంలో కూడా వివిధ అంశాల ఆధారంగా బోనకల్ గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేశారు. వైకుంఠధామం జిల్లాకే ఆదర్శవంతంగా ఉండేవిధంగా సర్పంచ్ భూక్య సైదా నాయక్, పంచాయతీ కార్యదర్శి దామల కిరణ్ నిర్మాణం చేశారు. కలెక్టర్ స్వయంగా పరిశీలించి జిల్లా వ్యాప్తంగా ఇదే రకంగా నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆనాడు సాక్షాత్తు కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. అన్ని హంగులతో వైకుంఠధామాన్ని స్వర్గ ధామముగా నిర్మించారు.



దామల్ల కిరణ్

వైకుంఠధామంలో కావలసిన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం అక్కడే కూర్చోవడానికి పెద్ద ఎత్తున బల్లలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మంచినీటి సౌకర్యం, దశదిన కర్మ నిర్వహించడానికి రేకుల షెడ్డు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా దర్శనం ఇస్తున్నది.

అదేవిధంగా కంపోస్ట్ షెడ్డు కూడా గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా నిర్మాణం చేశారు. ఆర్‌ఓబీ బ్రిడ్జి కింద కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను, నిర్మాణాలను తొలగించి సుందరవణంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించారు. అదేవిధంగా పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా బల్లలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సు ఆగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండల కేంద్రానికి వచ్చే జనం ద్విచక్ర వాహనాల కోసం ఆర్ఓబి బ్రిడ్జి కింద ఒక ఖానాను ఏర్పాటు చేశారు. ఈ



సైదా నాయక్

విధంగా గ్రామపంచాయతీలో అనేక మౌలిక వసతులను కల్పించి పంచాయతీ రూపురేఖలను మార్చారు. అనేక దఫాలు రాష్ట్ర అధికార బృందం గ్రామపంచాయతీలో మౌలిక వసతులను పరిశీలించారు. బోనకల్ గ్రామపంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయటం పట్ల తాజా మాజీ సర్పంచ్ భూక్య సైదా నాయక్, కార్యదర్శి దామల్ల కిరణ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా బోనకల్ గ్రామపంచాయతీని ఎంపిక చేయటం పట్ల ఎంపీడీవో లకావత్ రాజు, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా బోనకల్ గ్రామపంచాయతీ తాజా మాజీ పాలకవర్గం, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రయివేట్ చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ కంపెనీలు, వెహికిల్ ఫైనాన్స్ వారి

ఆగడాలను అరికట్టాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏసీపీకి వినతి



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో ప్రయివేట్ చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ కంపెనీలు మరియు వెహికిల్ ఫైనాన్స్ కంపెనీల వారు, వారు ఇచ్చిన అప్పులను రికవరీ చేసుకొనుటకు రికవరీ బాయ్స్‌తో లోన్లు తీసుకున్న వారిపై దౌర్జాన్యాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నగర ఏసీపీ రమణమూర్తిని పార్టీ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. నగరంలో ఫైనాన్స్ కంపెనీలు, వారి ప్రతినిధులు చేస్తున్న దౌర్జన్యం, ఆగడాల విషయాలపైన చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్, చిట్ ఫండ్స్ వారు, వెహికిల్ ఫైనాన్స్ వారు తామిచ్చిన అప్పులను లీగల్‌గా వసూలు చేసుకుంటే ఎవరికీ ఇబ్బంది వుండదు., కానీ అలా కాకుండా బెదిరింపుల ద్వారా వసూలు చేయాలని ఫైనాన్స్ కంపెనీలు రికవరీ బాయ్సును వారి ఇండ్ల మీదకు పంపి గలాటా చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న కొన్ని సంఘటనలు కూడా తమ దృష్టికి వచ్చాయన్నారు. అదేవిధంగా ఈ మధ్య కాలంలో రాజస్థాన్‌కు చెందిన ఒక కార్మికుడు ప్రయివేట్ వెహికిల్ ఫైనాన్స్ వద్ద వెహికిల్ కోసం ఫైనాన్స్ తీసుకుని కట్టలేకపోతే రికవరీ కోసం అతని వెంటపడి తరుముతూ పోతున్న సందర్భంలో అతను కాల్వలో పడి మరణించాడని గుర్తు చేశారు. ఇలాంటి ఆగడాలు ప్రయివేట్ చిట్స్, ఫైనాన్స్, వెహికిల్ ఫైనాన్స్ వారి ద్వారా జరగకుండా చూడాలని వారన్నారు. ప్రయివేట్ ఫైనాన్స్ ఆగడాలు ఇలానే కొనసాగితే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, యర్రా శ్రీనివాసరావు, ఎం.ఏ. జబ్బార్, ఎస్. నవీన్ రెడ్డి, నాయకులు మీరా సాహెబ్, మండల కార్యదర్శులు భూక్య శ్రీనివాస్, బోడపట్ల సుదర్శన్, బత్తిని ఉపేందర్ పాల్గొన్నారు.

పొగాకు కాదు పగ ఆకు

- డాక్టర్ రత్న మనోహర్

నవతెలంగాణ-తల్లాడ



పొగాకు కాదు పగ ఆకు అంటూ పొగాకును డాక్టర్ రత్న మనోహర్ అభివర్ణించారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రత్న మనోహర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్లు, చుట్టలు, తాగడం వల్ల తాగిన వారితోపాటు వారి పక్కనున్న వారికి అనేక వ్యాధులు అయ్యే అవకాశం ఉందన్నారు. పొగాకు తాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, రక్తపోటు, రక్తనాళాలు మూసుకుపోవడం, ఆకలి మందగించడం, క్షయ వ్యాధి, నిమోనియా, వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు పదార్థాలైన పాన్ మసాలా, గుట్కా, వాడడం వల్ల జీర్ణాశయ క్యాన్సర్, పేగుల క్యాన్సర్, పేగులలో అల్సర్లు రావడం, ఆకలి మందగించడం, తదితర అనర్థాలు సంభవిస్తాయన్నారు, ప్రజలందరూ ఈ విషయాలను గమనించి, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-పెనుబల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వియం బంజర్‌లో జిల్లా కమిటీ సభ్యులు కొర్ర తిరుమల్ అధ్యక్షతన రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయి శేషు మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పర్మిషన్లు లేకుండా ఇంటర్నేషనల్ సిలబస్‌ల పేరుతో వివిధ డొనేషన్ల పేర్లతో ప్రచారాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై, అధికారుల పర్యవేక్షణ కరవైందని అన్నారు. అధికారులు మొద్దు నిద్ర వీడి ఆ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని యూటీఎఫ్ జిల్లా నాయకులు రామారావు, మౌంటెనర్ మోతికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సామజిక వేత్త అన్నపురెడ్డి శ్రీనివాస్, టీసీ నాయకులు బజ్జూరి వంశీ, టీఆర్ఎస్ నాయకులు బాబురావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు చెక్కిలాల వంశీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గాయం తిరుపతిరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు స్వామి, తరుణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

శీనన్న ఎన్నికలప్పుడే వచ్చే టైపు కాదు...!

- పాలేరు నా సొంతిల్లు.... చక్కబెట్టుకునే బాధ్యత నాది
- మూడేళ్లలోపే అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఏడాదిలోపు రోడ్లు, డ్రయినేజీలు పూర్తిచేయిస్తా
- తాగు, సాగునీరుకి ఇబ్బందులు రానివ్వను
- తిరుమలాయపాలెం మండల పర్యటనలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

ఎన్నికలప్పుడు మాత్రమే ఓట్లకోసం వచ్చే టైపు మీ శీనన్న కాదు... ఇప్పుడు ఎన్నికలు లేవు... ఓట్లు అడగాల్సిన అవసరం లేదు. మీ ఆశీస్సులు... దీవెనలతో ఇక్కడి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని అయిన నేను మీ సమస్యలెంటో నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కారించేందుకు వచ్చాను. మీరు నాకిప్పుడు ప్రతి వినతిని పరిశీలించి.. వాటిన్నింటిని వీలైనంత త్వరగా పరిష్కారింపజేసేందుకు కృషిచేస్తానని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట, తాళ్లచెర్వు, బీరోలు, ఏలువారి గూడెం, బంధంపల్లి, బచ్చోడుతండా, సోలిపురం, రాజారాం, పైనంపల్లి, జూపెడ, కాకరవాయి, సుద్దవాగుతండా, ముజాహిద్ పురం, ఏనుకుంట తండా, మంగళిబండతండా, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి ఇళ్లు, రేషన్ కార్డు, పెన్షన్లు, రోడ్లు, కరెంటు, డ్రైనేజీలు తదితర సమస్యల పై ఇచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... పాలేరు నా సొంతిల్లు... చక్కబెట్టుకునే బాధ్యత నాదే.... మీ ఇంటి పెద్దకొడుకుగా నన్ను భావించి... అత్యధిక మెజారిటీతో నన్ను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించి మంత్రిగా నాకు అవకాశం కలిగేలా సహకరించిన మీ రుణం తప్పకుండా తీర్చుకుంటా... రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లలో ప్రతీ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు దక్కేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఆ ఇంటి మంత్రిని నేనే కాబట్టి





పాలేరు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికీ మూడేళ్లలోపే ఇల్లు దక్కేలా చూస్తానని మీకు హామీ ఇస్తున్నా..! అదేవిధంగా ఏడాదిలోపే నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలు పూర్తిచేయిస్తా... తాగునీరు, సాగునీరుకి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాను. విద్యా, వైద్యం, ఆరోగ్యం ఇలా ఏ రకమైన సమస్య వచ్చినా తీర్చే బాధ్యత నాదంటూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ రామ సహాయం నరేష్ రెడ్డి ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ బుద్ధ వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, ప్రముఖ వ్యాపారవేత్త బుద్ధ కనకయ్య, గంద్ర గోపాలరావు, ఉన్నం రాజశేఖర్, మందడి ఇజ్రాయిల్, గుగ్గిళ్ళ అంబేద్కర్ పాల్గొన్నారు.

యూనిఫామ్స్ 5వ తేదీ కల్లా పాఠశాలలకు చేర్చాలి

- స్టిచ్చింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సీఎంవో

నవతెలంగాణ-కల్లూరు

ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టిన యూనిఫామ్ స్టిచ్చింగ్ ఐదో తేదీ కల్లా పూర్తి చేసి పాఠశాలకు అందించాలని సీఎంవో రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం ఉషోదయ మండల సమైక్య కేంద్రంలో స్టిచ్చింగ్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కల్లూరు ఉషోదయ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఉషోదయ మండల మహిళా సమాఖ్య నందు మొత్తం నాలుగు మహిళా శక్తి కుట్టు కేంద్రాలు చెన్నూరు, కల్లూరు, నారాయణపురం, పాయపూరు, కేంద్రాల్లో 58 మంది యూనిఫామ్ స్టిచ్చింగ్ చేస్తున్నారు. మొత్తం విద్యార్థులు 2817 మంది ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థినీ విద్యార్థులు ఈ కేంద్రాలలో దుస్తులు తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు 2160 మందికి కేంద్రాల ద్వారా యూనిఫామ్ తయారు జరిగింది. సీఎంఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 5వ తారీఖు వరకు



పూర్తిస్థాయిలో ఆయా పాఠశాలలకు యూనిఫామ్ విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అప్పగించాలని సీఎంఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎం. వెంకట రామారావు, సీసీలు రాధా రుక్మిణి, వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్యామలాదేవి, ఎస్కే ఫాతిమా, వెంకట్రామమ్మ, ఎస్తేరు, ఆనంద్ కుమారి, రాజ్యలక్ష్మి, విద్యాశాఖ కీర్తి టైలర్లు చిన్నప్ప, బాలాజీ, కళ్యాణి, మండల సమైక్య అకౌంటెంట్ అపర్ణ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనికి నిధులు కేటాయించి కూలీలను ఆదుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాలు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులు కల్పించాలని, రోజుకు రూ.600 చొప్పున ఇవ్వాలని రెండు లక్షల కోట్లు బడ్జెట్ల కేటాయించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలు నుంచి ఉపాధి హామీ పనికి నిధులు తగ్గించుకుంటూ వస్తూ నేడు 69 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. రోజు కూలీ 300 రూపాయలు కేటాయించినా కూలీలకు 150 నుంచి 200 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. వేసవి అలవెన్సు ఇవ్వడం లేదన్నారు. పనిముట్లు ఇవ్వడం లేదు, కొలతల పేరుతో పని దగ్గర ఇబ్బందులు కల్పిస్తున్నారని అన్నారు. మండలంలోని వెదర్ల చెరువు గ్రామంలో ఉపాధి



కూలీల పని వద్దకు వ్యకాస సర్వే కోసం వెళ్లి వారితో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారి పని విషయాలు, ఉన్న ఇబ్బందులు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు నెరుసుల వెంకటేష్ అధ్యక్షులు వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం మండల కార్యదర్శి అంగిరేకుల నరసయ్య, వర్షపొంగు వీరన్న, అల్లి యశోద లలిత, రాజేశ్వరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కంకణాల వెంకటేశ్వర్లు మృతి

- సీపీఐ(ఎం), న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్, ఆప్ పార్టీల నివాళి

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిధిలోని సీంగరాయపాలెం గ్రామానికి చెందిన కంకణాల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. వెంకటేశ్వర్లు చిన్ననాటి నుంచి వామపక్ష భావజాలం వైపు ప్రయాణించాడు. ముందుగా న్యూడెమోక్రసీ పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసి తర్వాత సీపీఐ(ఎం)లో చేరి పనిచేశాడు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి వైరా మత్సకార సంఘం సొసైటీ డైరెక్టర్‌గా పోటిచేశాడు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతిడికి నలుగురు పిల్లలు ఉన్నారు. పది సంవత్సరాల క్రితం భార్య పది సంవత్సరాల క్రితం మరణించింది. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, జట్ల ఆనందరావు, ఆప్ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, ప్రజాపంథా మాస్ లైన్ నాయకులు కె. అర్జున్‌రావు, సీవై.పుల్లయ్య లాల్ మియా, బీఆర్ఎస్ నాయకులు వడ్లమూడి క్రిష్ణార్జున్‌రావు, సీపీఐ(ఎం) నాయకులు దండు క్రిష్ణ, షేక్ అఫ్జల్, ఖాసింబేగ్, వేము నాగరాజు, కంకణాల వెంకటి బజార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ప్రభుత్వం ఉద్యోగులకు పదవి విరమణ తప్పదని వైద్యాధికారి డాక్టర్ వీరబాబు పేర్కొన్నారు.ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఫ్ఎన్ఓగా విధులు నిర్వహిస్తున్న కే.ధనలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వీరబాబు పదవీ విరమణ ఉత్తర్వుల కాపీ అందచేసి శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేశారు. ఈ కార్రమంలో హెచ్ఈఓ సదాశివరావు, స్టాఫ్ నర్స్ రోజా, హెల్త్ అసి స్టెంట్స్ సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది, ధనలక్ష్మి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ కోర్సులను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-మధిర

మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండల పరిసర ప్రాంత విద్యార్థులు సైన్స్ గ్రూపులను సద్వినియోగం చేసుకోవాలని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్ఎల్ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ సెక్షన్లు లేకపోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులు సైన్స్ విద్య పొందేందుకు దూరప్రాంతాలకు వెళుతున్నారని తెలిపారు. 2024 - 25 విద్యా సంవత్సరానికి మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ అనే రెండు కొత్త కోర్సులు మంజూరైనట్లు తెలిపారు. వీటితోపాటు బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్ కోర్సులు జనరల్ కోర్సులు పూర్తిగా విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు దోస్త్ అడ్మిషన్ తీసుకొని మధిర డిగ్రీ కళాశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అడ్మిషన్ల సమాచారం కొరకు దోస్తు కోఆర్డినేటర్ జి అరుణ 9441786508 ను సంప్రదించాలని కోరారు.



కరాటే విద్యతో శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం

- 15వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు
- ముగిసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులు

నవతెలంగాణ-సత్తుపల్లి

కరాటే విద్యను నేర్చుకోవడం ద్వారా శారీరక దారుఢ్యం వృద్ధి చెందడంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని 15వ గిరిజన బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు అన్నారు. సత్తుపల్లి లయన్ బుడోకాన్ కరాటే హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉచిత కరాటే వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమం శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో కమాండెంట్ వెంకటరాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత కొన్నేండ్లుగా సత్తుపల్లి పట్టణంలోని విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. కరాటేలో శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా కృషిచేస్తున్న కరాటే శిక్షకుడు, కరాటే నేషనల్ రిఫరీ మాస్టర్ పిచ్చయ్యను ఈ సందర్భంగా అభినందించారు. కరాటే మాస్టర్ పిచ్చయ్య మాట్లాడుతూ 30యేండ్లుగా సత్తుపల్లి ప్రాంత విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక బహుమతులు పొందారన్నారు. అనంతరం పిచ్చయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్, నవచైతన్య సేవాసంస్థ, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, సృజన, లైవ్ సంస్థల బాధ్యులు బొర్రా వెంకటరావు, తోట కిరణ్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సలీం పాల్గొన్నారు.

తాతా మధు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కారేపల్లి



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు జన్మదిన వేడుకలను కారేపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఎంపీపీ మాలోత్ శకుంతలకిషోర్, వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన పనులను విజయవంతంగా నిర్వహించిన నేత తాతా మధు అని కొనియాడారు. ఎమ్మెల్సీగా కారేపల్లి మండలానికి అనేక అభివృద్ధి పనులు చేయించారన్నారు. తాతా మధు సేవలు వినియోగించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, మాజీ సర్పంచ్‌లు మాలోత్ కిషోర్, బానోత్ కుమార్, నాయకులు జూపల్లి రాము, గుగులోత్ కుమార్, లివింగ్‌స్టన్, గుగిళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహిస్తేనే మన్ననలు

- అడిషనల్ కలెక్టర్ మధుసుధన్ నాయక్

నవతెలంగాణ-కామేపల్లి



బాధ్యతతో విధులు నిర్వహిస్తే ప్రతి ఉద్యోగి ప్రజల మన్ననలు పొందుతారని ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన నరుగుల బలరాం శంకర్ పదవి విరమణ శుక్రవారం రైతు వేదికలో తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బలరాం శంకర్ 38 సంవత్సరాలు రెవెన్యూ శాఖలో పనిచేసి ఎలాంటి రిమార్క్ లేకుండా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తే ప్రజలు గుర్తింపు పొందుతారన్నారు. బలరాంశంకర్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి రెవిన్యూ ఉద్యోగి విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సక్రు, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది జ్యోతి, సారయ్య, ఆనంద్, రాజు, సర్వేయర్ బాసు మియా, ఏఎస్ఓ బొంగాని సైదులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే అధికారుల నిర్వాకం...?

- పేదల భూమి పెద్దలకు...?
- రూ.4 కోట్ల భూమిని రియల్ వెంచర్‌లోకి మార్పు..
- భారీ ఎత్తున చేతులు మారిన ముడుపులు...?
- రోడ్డున పడ్డ బాధిత కుటుంబం...?

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



ఖమ్మం రూరల్ రెవిన్యూలో పైసలిస్తే ఎంతటి పనైనా ఇట్టే జరిగిపోతుందన్నది వాస్తవమే....కాని ఎదుటి వారి భూమిని మనకు కావాలన్నా చేసి పెట్టే వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు....ఇది సాక్షాత్తు రెవెన్యూ మంత్రి నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యలయంలో సర్వే అధికారులు చేసేపెట్టే భూ దందా వ్యవహరం....సర్వే అధికారుల నిర్వాహకులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని ఓ రెవిన్యూ గ్రామంలో సుమారు రూ.4 కోట్ల విలువ చేసే పేదల భూమిని పక్కనే ఉన్న పెద్దల భూమిలో కలిపిన వ్యవహరం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 60 ఏండ్ల నుండి పట్టేదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్న ఆ పేద రైతుల భూమిని సర్వే చేసిన అధికారులు వారికి సర్వే రిపోర్టు ఇవ్వకుండా కార్యాలయం చుట్టు తిప్పుకుని చివరకు మీకు అక్కడ భూమే లేదని చెప్పడంతో సదరు పేద రైతు అవాక్కయ్యారు. పేదల భూమిని రియల్ వ్యాపారులకు కట్టబెట్టడంలో రియల్ వ్యాపారుల నుండి సర్వే అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేదలను ముంచి పెద్దలకు...

మండలంలోని ఏదులాపురం రెవిన్యూలో ఓ పేద రైతుకు కొంత భూమి ఉంది.అట్టి భూమిలోని కొంత భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్ముకున్నాడు. అదిపోను మరో ఎకరం భూమిని వారు ఉంచుకున్నారు. అయితే సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి దాంట్లో కొంత భూమి కలవడంతో సదరు వ్యాపారి పేద రైతును సర్వే చేయించుకుని ఎంత భూమి ఉంటే అంత మీ భూమికి మీరు హద్దులు పెట్టుకోమని సలహ ఇస్తాడు. దీంతో ఆ రైతు తన భూమిని సర్వే చేయాలని గత రెండేండ్ల క్రితం చలాన్ కట్టుకున్నారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. భూమి సర్వేకి వచ్చిన సర్వే అధికారులు సర్వే చేసి పేద రైతుకు చెందిన ఎకరం భూమిని కూడా సదరు రియల్ వెంచర్‌లో కలిపినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే పేద రైతుకు మాత్రం సరైన రాళ్లు దొరకడంలేదు మళ్లీ వచ్చి సర్వే చేస్తామని చెప్పి అక్కడినుండి జారుకున్నారు. అనంతరం సుమారు 18 నెలలుగా సదరు రైతు భూమి సర్వే కోసం సర్వే అధికారుల చుట్టు చెప్పులు అరిగేలా తిరుగుతూనే ఉన్నారు.ఆఖరుకు రైతు సర్వే అధికారులను గట్టిగా నిలదీయడంతో అసలు మీకు అక్కడ భూమేలేదని తేల్చి చెప్పారు. అది విన్న రైతు అవాక్కయ్యాడు. అదేంటి 60 ఏండ్లుగా అట్టి భూమికి సంబంధించిన పట్టేదారు పాసుపుస్తకాలు, పహణీలు ఉండి సాగు చేసుకుంటున్న భూమి అందులో కొంత అమ్ముకోగా ఇంకా ఎకరం భూమి ఉండాలి కాని సర్వే చేసిన అధికారులు అసలు భూమే లేదని చెప్పడం ఏమిటో అర్థం కాని ప్రశ్నగా మారిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పెద్ద మొత్తంలో ముడుపులు...



రైతుకు ఉన్న భూమిలో కొంత అమ్ముకోగా ఇంకా ఎకరం భూమి ఉండగా అట్టి భూమిని సర్వే చేయమని దరఖాస్తు చేసుకున్న పాపానికి సర్వే అధికారులు ఏకంగా ఎకరం భూమిని రియల్ వెంచర్‌లో కలిపేసారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద రైతుకు చెందిన ఎకరం భూమిని పెద్దలకు కలిపినందుకు సదరు సర్వే అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు మండలంలో బలంగా ఉన్నాయి. ఈ విధంగా సర్వే అధికారులకు పైసలిస్తే ఎంతటి భూమినైనా ఇట్టే మార్చేస్తారని ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్వే అధికారుల ఆకృత్యాలపై దృష్టిసారించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.ఈ విషయమై సర్వేయర్‌ను వివరణ కోరగా...ఏదులాపురం రెవిన్యూలో ఎకరం భూమి ఎవరిది వెంచర్‌లో కలపలేదని, అలాంటి విషయం తమకు తెలియదని తెలిపారు.

అందుబాటులో విత్తనాలు

- జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



రైతులకు అవసరమైన విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖమ్మంలోని బర్మా షెల్ రోడ్, గాంధీచౌక్‌లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్, అమ్మకం రశీదులను పరిశీలించారు. స్టాక్ బోర్డ్‌లో నమోదులు ఖచ్చితంగా ఉండాలన్నారు. విత్తనాల ప్యాకెట్లు క్యూ ఆర్ కోడ్‌లు పరిశీలించారు. దుకాణాల లైసెన్సులు తనిఖీ చేసి, స్టాకు, అమ్మకం వివరాలు తనిఖీ చేశారు. ఏ పంట విత్తనాలు, ఏ రకాలు రైతులు అడుగుతున్నారని, దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలుకు వచ్చిన రైతులతో సంభాషించారు. పోయినసారి ఏ పంట వేశారు, ఈ సారి ఏ పంట వేస్తున్నది అడిగారు. అన్ని బ్రాండ్ల విత్తనాలు ఒకటేనని, ఒకటే బ్రాండ్ అందరూ కొని, ఆ బ్రాండ్ విత్తనం డిమాండ్ పెంచి నష్టపోవద్దని, ఏ బ్రాండ్ అయిన వాతావరణ పరిస్థితులు, నిర్వహణపైనే దిగుబడి వస్తుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2024 పంటకు జిల్లాలో అవసరమైన మేర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు, రైతులకు సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విడిగా ఉన్న సంచులోని విత్తనాలను కొనుగోళ్లు చేయవద్దని. ఆయా కంపెనీ లేబుల్ కలిగిన ప్యాకెట్లను కొనుగోలు చేయాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోళ్లు చేసిన డీలర్ నుండి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వానకాలం సీజన్‌కు గాను పత్తి పంట సాగయ్యే 2 లక్షల ఎకరాలకు అవసరమైన 4 లక్షల ప్యాకెట్లకు గాను, జిల్లాలో ఇప్పటికే 4 లక్షల 50 వేల ప్యాకెట్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఇంకనూ లక్షకు పైగా ప్యాకెట్లు తెప్పించడానికి కార్యాచరణ చేశామన్నారు. ఇప్పటివరకు 45 వేల ప్యాకెట్లు మాత్రమే అమ్మకం జరిగినట్లు తెలిపారు. ఈ వాన కాలంలో వ్యవసాయ శాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను 60 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. జిల్లాకు 21 వేల క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనాల కేటాయింపుకు గాను, 14 వేల క్వింటాళ్ల జిల్లాకు చేరుకోగా, 11 వేల క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు, 3 వేల క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండలం వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వైద్య కళాశాల నిర్మాణం

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య విద్యా సంచాలకులు డాక్టర్. ఎన్. వాణితో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల శాశ్వత భవనాలకు ఖమ్మం అర్బన్ మండలం బల్లెపల్లి, రఘునాథపాలెం గ్రామాల్లో సుమారు 43 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలన్నారు. నిర్మాణ ప్లాన్‌లో కళాశాల భవనాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, అధ్యాపకుల క్వార్టర్స్ నిర్మాణం, హైవే కు కళాశాల ప్రధాన భవనం పేసింగ్ ఉండి, విజుబుల్ గా ఉండేట్లు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. స్థలం సమస్య లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు వైద్య విద్య సంచాలకులు డాక్టర్ విమల థామస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ. కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఖమ్మం అర్బన్ మండల తహశీల్దార్ సిహెచ్. స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

లోక్‌సభ సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తుకై చేపట్టాల్సిన చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు ప్రవేశ మార్గం పై సూచనలు చేశారు. కేంద్రం ఆవరణలో, కేంద్రం లోపల చేపట్టాల్సిన బ్యారికెటింగ్ పై అధికారులకు నిర్దేశం చేశారు. పార్కింగ్, క్లోక్ రూమ్ ఏర్పాటు గురించి పరిశీలించారు. మెడికల్ శిబిరం, మీడియా పాయింట్ గురించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఫలితాల ప్రకటనకు చర్యల గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రంలోకి కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల ప్రవేశం, స్ట్రాంగ్ రూమ్ నుండి కౌంటింగ్ హాల్ కి, కౌంటింగ్ పూర్తయిన పిదప ఈవీఎంలను జిల్లా స్ట్రాంగ్ రూమ్‌కు చేరవేతపై అధికారులకు సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డిసిపి ప్రసాదరావు, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంకాయల రాజు

నవతెలంగాణ-ఖమ్మం



విద్యాహక్కు చట్టానికి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తూట్లు పొడుస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంకాయల రాజు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా పర్మిషన్లు లేకుండా ఇంటర్నేషనల్ సిలబస్‌ల పేరుతో వివిధ డొనేషన్ల పేర్లతో పర్మిషన్ లేకుండా జిల్లా వ్యాప్తంగా హోర్డింగ్స్ పెట్టి ప్రచారాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై, అధికారుల పర్యవేక్షణ కొరవైందని, అధికారులు మొద్దు నిద్ర వీడి పర్మిషన్ లేకుండా ఖమ్మం జిల్లాలో నడుపుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలపై చర్యలు తీసుకొని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, కార్తీక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో రైతులకు విత్తనాలపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ



వానాకాలం పంటల సీజన్లో విత్తనాలు కొనుగోలుపై రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ దివ్యమనిషా కోరారు. మండలంలోని యడవల్లి, సువర్ణాపురం, ముదిగొండ, బాణాపురం, వల్లభి గ్రామాలలో శుక్రవారం విత్తనాల కొనుగోలుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ షాప్‌లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎరువుల దుకాణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని ఏఈఓ దివ్యమనిషా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వీ.వంశీ, పీ.రఘు, ఏ.మౌనిక, ఎస్.లికిత, పలువురు రైతులు పాల్గొన్నారు.



బయ్యారం ఉక్కుతో ఉద్యోగ, ఉపాధి

- మౌళిక సమస్యలపై నిర్లక్ష్యంతోనే కేసీఆర్ ఓటమి
- మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి

నవతెలంగాణ-కారేపల్లి

బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని, ఏజన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కారేపల్లిలో జరిగిన కామేపల్లి, కారేపల్లి మండల కమిటీల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలం పాలించిన కేసీఆర్ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం చూపటంలో నిర్లక్ష్యం వహించటం మూలంగా ఓటమితో మూల్యం చెల్లించుకున్నారని విమర్శించారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలం గడపకుండా ప్రజాసమస్యలు, అభివృద్ధి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సాగు,త్రాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయటానికి జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఆంధ్రలో కలిసిన ఆడు పంచాయతీలు తెలంగాణకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అయిందని రైతన్న అవసరాలను అనుగుణంగా రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు విక్రయించే వారిపట్ల ఉదాసీనత ప్రదర్శిస్తే ఉద్యమాలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, మండల కార్యదర్శులు గుమ్మడి సందీప్, ఎస్వీ.రాకేష్, నాయకులు గుగులోత్ తేజానాయక్, భాస్కర్, పులకాని సత్తిరెడ్డి, దారావత్ సక్రు, బానోత్ బాలు, అనసూర్య, సరోజినీ, తేజావత్ రంగ్యా, రాజు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట విత్తనాలతో అధిక పోషణ

- వ్యవసాయ అధికారి రామ్మోహన్

నవతెలంగాణ-వేంసూరు

రైతులు తమ పంట పొలాలలో పచ్చిరొత్త విత్తనాలను చల్లి అధిక పోషణ లు పొందాలని మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండగట్ల సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందేందుకు సేంద్రియ పద్ధతిని అవలంబించాలని, భూ సారవంతంగా మారడంతో పాటు ఎక్కువ దిగుబడి పొందేందుకు ఉపయోగప డుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో చెన్నారెడ్డి, దాయక కృష్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

హీరో సుమన్‌చే 'సూపర్‌స్టార్' కృష్ణ జయంతి వేడుక

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి డివిజన్ సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సినీనటుడు స్వర్గీయ ఘట్టమనేని శివరామకృష్ణ 81వ జయంతి వేడుకను కృష్ణాజిల్లా జిల్లా గన్నవరం సమీపంలోని పెద అవుటపల్లి చర్చిలో శుక్రవారం సినీ హీరో సుమన్ సమక్షంలో ఘనంగా జరిపారు. సుమన్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి కృష్ణ ముఖచిత్రంతో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ సూపర్‌స్టార్ కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు కోటమర్తి వెంకటేశ్వరరావు, సంఘ బాధ్యులు సత్యనారాయణ, నాగరాజు, మోహనరావు, వెంకటేశ్వరరావు, కన్నారావు, రామచంద్రం, జయరాజు, రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎంఎస్.రెడ్డి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

చింతిర్యాల గోదావరి నుండి 'ఇసుక ఫ్రీ హిట్'

పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో తరలుతున్న వైనం

- వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని చింతిర్యాల గోదావరి నుండి ఇసుక ఫ్రీ హిట్ అనే విధంగా తరలుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా కొందరు ట్రాక్టర్ నిర్వాహకులు పెద్ద ఎత్తున గోదావరి నుండి ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుక రూ.2000 నుండి 2500 వరకు వసూలు చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులెవ్వరూ పట్టించుకోకుండా చూసి చూడనట్టు వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. సాయంత్రం 7:00 గంటల సమయం దాటితే గోదావరిలో ఇసుక ట్రాక్టర్ల జాతర కొనసాగుతుందని స్థానికులు తెలుపుతున్నారు. ఇసుక ట్రాక్టర్ల వేగానికి రాత్రి సమయంలో నిద్ర కూడా సరిగ్గా పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

మచ్చుకైనా కనిపించని మైనింగ్ అధికారులు

మండలంలో గత కొంతకాలంగా గోదావరి నది నుండి పెద్ద ఎత్తున అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్నప్పటికీ మైనింగ్ శాఖ అధికారులు మచ్చుకైనా కనబడడం లేదని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అంటున్నారు. అమెర్ద, అమ్మగారిపల్లి, చింతిర్యాల, ఆనందాపురం, నెల్లిపాక గోదావరి ర్యాంపుల నుండి అక్రమ ఇసుక రవాణా కొనసాగుతున్న స్థానిక అధికారులెవ్వరూ గోదావరి వైపు కన్నెత్తి చూడకపోవడం ఏంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వేసవి కాలం ప్రారంభం అయినప్పటి నుండి అక్రమ ఇసుక రవాణా దారులు ఇసుక తోలకాలను యధేచ్ఛగానే కొనసాగిస్తూ పెద్ద ఎత్తున ఇసుక నిల్వలను పెట్టుకొని సొమ్ము చేసుకోవడంతోపాటు, ప్రభుత్వ ఆదాయానికి భారీ మొత్తంలో గండి కొట్టారని కొన్ని వర్గాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గోదావరి ర్యాంపులకు ట్రంచులు కొట్టించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఆర్ఐ నాగమణిని వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణా దారులపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, గోదావరి ర్యాంపుకు ట్రంచ్ కొట్టించాలనే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

పర్సా త్యాగం పోరాటపటిమ

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు
- కార్మిక పోరాటాలకు పర్సా మార్గదర్శకం
- పోతినేని సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న చుక్కా రాములు

నవతెలంగాణ-కొత్తగూడెం

పర్సా త్యాగం పోరాటపటిమ తరతరాలకు తరగని స్ఫూర్తి అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో పర్సా శతజయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక క్లబ్‌లో ప్రారంభించారు. తొలుత సీఐటీయూ జెండాను సంఘం సీనియర్ నాయకులు పీ.రాజారావు ఆవిష్కరించారు. పర్సా సత్యనారాయణ జీవిత విశేషాలు తెలిపే ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను సీనియర్ నాయకులు ఎంఎస్.రెడ్డి ప్రారంభించారు. శాసన సభ్యుడుగా ఉన్న నాటి ఫొటోలు, చివరి అంకంలో ఆయన పాల్గొన్న పలు కార్యక్రమాలతో పాటు మరణాంతరం కొత్తగూడెంలో జరిగిన అంతిమ యాత్ర ఫొటో ఎగ్జిబిషన్ అందరిని ఆకట్టుకుంది. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చుక్కా రాములు మాట్లాడారు.

నీతికి నిజాయితీకి రోల్ మోడల్.... విశ్రాంత సింగరేణి మాజీ డైరెక్టర్ బి.భాస్కరరావు

నీతిగా, నిజాయితీగా ఏ రంగంలో పనిచేసే వారికైనా పర్సా సత్యనారాయణ ఒక రోల్ మోడల్ అని భాస్కర రావు తెలిపారు. పర్సా జీవన విధానం నిజాయితీ, అంకితభావం తన పైన ప్రభావం చూపిందన్నారు. తాను పనిచేసిన సింగరేణి సంస్థలో పని చేస్తున్న వత్తికి న్యాయం చేయాలని పర్సా తరచూ చెప్పేవారని గుర్తు చేశారు. గనుల్లో మహిళలు పనిచేయడాన్ని పూర్తి అడ్డుకున్నారని తెలిపారు. ఆయన మానవత్వం కలిగిన మహనీయుడు అని కొనియాడారు. సమాజ ప్రగతి కోసం పోరాడని చెప్పారు.

కమ్యూనిస్టులతోనే దేశ భవిష్యత్.. : జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర రావు

కమ్యూనిస్టులతో మాత్రమే దేశానికి భవిష్యత్తు ఉందన్నారు. ఉత్తమ కమ్యూనిస్టు పర్సా అని, పర్సా లాంటి నేతలు ఇప్పటికీ కమ్యూనిస్టులు మాత్రమే ఉన్నారని ఉద్ఘాటించారు. సిపిఎం పార్టీ తోటి ఏర్పాటైన మా కుటుంబ సంబంధం విడదీయరాని బంధం అని తెలిపారు. కమ్యూనిస్టు కార్మిక పోరాటాలకు అండగా ఉంటానని అన్నారు. కొత్తగూడెంలో పర్సా సత్యనారాయణ విగ్రహ ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారం అందిస్తాయని సభ ముఖంగా వెల్లడించారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని అనడం కాదని, భవిష్యత్తులో కాలాన్ని నడిపించేది కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు.దోపిడి, అక్రమాల నుండి ప్రజలను కాపాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. "నేను కమ్యూనిస్టుని.." అని గర్వంగా చెప్పుకునేది ఒక్క కమ్యూనిస్టు మాత్రమేనని ఇతర నాయకుడు ఎవ్వరు గర్వంగా చేప్పులేదని తెలిపారు.



అనంతరం మతోన్మాదం కార్మిక వర్గం ప్రభావం అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య పర్సా స్మారక ఉపన్యాసంలో ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, మందా నరసింహారావు, నవతెలంగాణ మాజీ మేనేజర్ ఎం.సుబ్బారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.వెంకటేష్, వంగూరి రాములు, సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.విష్ణువర్ధన్, కల్యాణ వెంకటేశ్వరరావు, నాయకులు, పిఎస్ఎన్ మూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజే.రమేష్ జి. పద్మ, డి.వీరన్న, ఎస్ఏ.నబి, దొడ్డ రవి, కె.సత్య పిట్టల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలకు పర్సా మార్గదర్శకం



పర్సా త్యాగశీలి, ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుని వారి యోగక్షేమాలు, వారి ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమాలను ఉత్తరం ద్వారా తెలుసుకునే అలవాటు ఉన్న మహోన్నత వ్యక్తి పర్సాఅని గుర్తుచేశారు. అనేక కార్మిక పోరాటాలకు పర్సా మార్గదర్శకమని అన్నారు. తన జీవితమే ఉద్యమంగా... ఉద్యమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పర్సా అని కొనియాడారు.

-: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

బడిబాట కార్యక్రమం పకడ్బంధీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్



నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వ పాఠశాలలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో కూడిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి అందరికీ తెలియజేసి, వారందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

6 నుండి 14 సంవత్సరాల వయసు కలిగిన బడిఈడు పిల్లలందరినీ గుర్తించి, సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు. మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో, మహిళా సమాఖ్యల ద్వారా, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన విద్య గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహనలో భాగంగా, పాఠశాలల్లోని ఎకో క్లబ్స్ ఆధ్వర్యంలో, సమ్మర్ క్యాంప్స్ నిర్వహించాలని, సంబంధిత షెడ్యూల్‌ని కూడా అందరికీ తెలియజేసి, సక్రమంగా అమలయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పీపీటీలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వర చారి, అడిషనల్ డీఆర్డిఓ రవి, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూర్య , జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి ఇందిర, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవరావు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, జిల్లా సైన్స్ అధికారి, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన పురుగు మందుల షాపులపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- రైతులు ప్రతి కొనుగోలుపై బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి



నవతెలంగాణ-చంద్రుగొండ

మండల పరిధిలో ఉన్న పలు విత్తన పురుగుమందుల షాపులపై శుక్రవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ శాఖ, సంయుక్త ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న విత్తనాలను, వాటికి సంబంధించిన బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అమాయక రైతులను ఆసరా చేసుకొని నకిలీ విత్తనాలు, విక్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్ ఫోర్సు నియమించడం జరిగిందన్నారు. ఈ టీం ఎప్పటికప్పుడు విత్తనాల షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి విత్తనాలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. షాప్‌లో యజమానులు అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. అలా కాదని నకిలీ విత్తనాలను ఎవరు విక్రయించిన అట్టి వారిపై క్రిమినల్ కేసులతోపాటు బైండవర్ కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు కూడా కొన్న ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో కొత్తగూడెం టాస్క్ ఫోర్స్ సబ్ ఇన్స్ స్పెక్టర్ రాజు కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వినయ్, ఇరు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేట్ విద్యా సంస్థల్లో కౌంటర్ సేల్స్‌పై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం : ప్రయివేట్ కాలేజీలు, స్కూళ్లలో నిబంధనలకు విరుద్ధంగా కౌంటర్లు ఏర్పాటు చేసి బుక్స్, యూనిఫామ్, షూస్‌లు అమ్ముతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అధికారుల అండదండలతో ప్రయివేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల వారు విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వస్తువులను అమ్ముతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సెలవు దినాల్లో క్లాస్‌లను నిర్వహిస్తున్నా విద్యా శాఖ అధికారులు విద్యా సంస్థల వారు ఇచ్చే అవినీతి సొమ్ముకు ఆశపడి చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బయట రూ.1,000లు ఉన్న యూనిఫాంకు రూ.4,000లు రూ.500 ఉన్న షూష్‌కు రూ.2000ల వరకు వసూలు చేస్తున్నారని, బుక్స్ అయితే ఇష్టం వచ్చినంత రేట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులపై ఎవరైనా తల్లిదండ్రులు అడుగుతే అడ్మిషన్ కాన్సిల్ చేస్తామని, ఇంకో స్కూల్లో జాయిన్ చేసుకోకుండా టీసీ ఇస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ రత్నకుమారి

- అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు



కొత్తగూడెం : జాతీయ స్థాయి పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ రత్నకుమారిని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అభినందిచారు. 100 మీటర్స్, 400 మీటర్స్ హర్డిల్స్ జంప్ విభాగాలలో జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో బంగారు పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ రత్నకుమారిని శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో రోహిత్ రాజు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నకుమారి ఇటీవల హైదరాబాద్ నందు నిర్వహించిన "పాన్ ఇండియా ఓపెన్ మీట్"లో 100 మీటర్స్, 400 మీటర్స్ హర్డిల్స్ జంప్ విభాగాలలో బంగారు పతకాలను సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలలో తనకున్న మక్కువతో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలలో పతకాలను సాధిస్తున్న రత్నకుమారి భవిష్యత్తులో కూడా మరెన్నో విజయాలను సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఇట్టి క్రీడా పోటీలలో మరింతగా విజయాలు సాధించడానికి తమ వంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, 3 టౌన్ సీఐ శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలి

- నకిలీ విత్తనాలు పురుగుమందుల కంపెనీలపై చర్యలు తీసుకోవాలి
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్



నవతెలంగాణ-కొత్తగూడెం

రైతులకు రూ.2 లక్షల రుణాలను వెంటనే మాఫీ చేయాలని, నకిలీ విత్తనాలు, పురుగుమందుల కంపెనీలపై కఠినచర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు చెల్లించాలని, దొడ్డు వడ్లకే రూ.500 బోనస్ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులు కొత్తగూడెం ఆర్డీవో ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ రైతాంగ సమస్యలపై ఇచ్చిన పిలుపు మేరకు కొత్తగూడెం ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా రైటర్స్ బస్తులోని ఐఎఫ్టియు కార్యాలయం నుండి జిల్లాలోని అన్ని మండలాల నుండి కదలి వచ్చిన రైతు కూలీలతో ప్రదర్శన నిర్వహించారు. ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు ఎదళ్లపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య ప్రసంగిస్తూ ప్రభుత్వం రెండు లక్షల రుణాలను డిసెంబర్ 9నాటిక రద్దు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడని, దానిని అమలు చేయకపోగా ఆగస్టు 9వ తేదీన రుణమాఫీ చేస్తానంటూ కాలయాపన చేయడం తెలంగాణ రైతులను మోసగించడమేనని అన్నారు. తక్షణమే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతుల రెండు లక్షల రుణాలను మాఫీ చేసి, కొత్త రుణాలను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు పురుగుమందుల కంపెనీలు రైతులను నిండా ముంచుతున్నాయని ప్రభుత్వం అధికార యంత్రాంగం నకిలీ కంపెనీల పట్ల నిమ్మక్క నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నదని, నకిలీ పురుగుమందులు కంపెనీలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు మొక్క జొన్న వరి తదితర ధాన్యం తడిసిపోయిందని ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఎరువులు విత్తనాలు వ్యవసాయ పరికరాలను 75 శాతం సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దొడ్డు వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాలని, అన్ని పంటలకు ముందుగానే మద్దతు ధరలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల ఎడల ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు జి.అనురాధ, ఉపాధ్యక్షులు జే.సీతారామయ్య, మెస్సు గోపాల్, హరీజా, నర్సింగ్, వీర మల్ల రాములు, వివిధ సంఘాల నాయకులు ఎల్.విశ్వనాథం, ఎండి.రాసుద్దీన్, బయ్య శారద, ఆదిలక్ష్మి, కల్తి రాములమ్మ మోకాళ్ళ రమేష్, మోకాళ్ల సుగుణ, భానుచందర్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక స్ఫూర్తిని పెంచుకోవాలి

నవతెలంగాణ-మణుగూరు

బాల్యం నుండే విద్యార్థులలో చదువుతోపాటు సామాజిక సేవా స్ఫూర్తినీ పెంచుకోవాలని మంగీలాల్ అన్నారు. తన కుమారుడు టాటా లాల్ జన్మదిన వేడుకల సందర్భంగా అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో తన శక్తి మేరకు తన జీవిత సహచరి అనసూర్యతో కలిసి బియ్యాన్ని, పండ్లను తన కుమారుడి చేతుల మీదుగా వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత చరమాంకంలో ఉన్న పండు టాకులకు కుటుంబ సభ్యులు మేమున్నామని భరోసా ఇవ్వవలసిన బాధ్యత ఉందన్నారు. టాటా లాల్‌కు వృద్ధులు ఆశీస్సులు అందజేయడంతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణా దశాబ్ది ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలి

- తెలంగాణ ఉద్యమకారుడు, జడ్పీ చైర్మెన్ కంచర్ల

నవతెలంగాణ-కొత్తగూడెం

దశాబ్దాల పోరాటాలతో ఎంతోమంది తెలంగాణా బిడ్డల ప్రాణత్యాగాలతో 2జూన్ 2014 నాడు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం రేపటికి 10 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా తెలంగాణా రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర సాధన కల సాకారం కోసం ఎంతోమంది తెలంగాణా రాష్ట్ర ప్రజలు, నాయకులు, ఉద్యోగులు సమైక్య పోరాటంతో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అంచెలంచెల ఉద్యమ పోరాటాలు చేసి ఎంతో మంది అమరవీరుల ప్రాణ బలిదానాలతో సాధించుకున్న తెలంగాణానను ప్రజలందరి కోరికల మేరకు, ఉన్నతంగా అభివృద్ధి చేసుకునేందుకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తుందని చెప్పారు. రేపటి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన తెలంగాణ అమరవీరులను పేరు, పేరునా స్మరించుకొని ఘనంగా నివాళులు అర్పించాలని కోరారు.

మత్తులో మునిగి యువత ఆరోగ్యాలు నాశనం చేసుకోవద్దు

- ప్రిన్సిపల్ కే.వెంకటేశ్వర్లు

పాల్వంచ రూరల్ : మత్తులో మునిగి యువత ఆరోగ్యాలు నాశనం చేసుకోవద్దని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (సీఓఈ) ప్రధాన ఆచార్యులు డాక్టర్ కే.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం పరీక్షలకు హాజరైన విద్యార్థులతో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ధూమపానానికి అలవాటై విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రధాన చార్యుడు కే.వెంకటేశ్వర్లు, భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఆనంద్‌లు అన్నారు. విప్లవకారుడు చేగువేరా నోటిలో ఉన్నది సిగరెట్ అనుకొని కొందరు అపోహ పడుతున్నారని, ఆయనకు ఆస్తమా వ్యాధి ఉండడంతో ఒక ఆయుర్వేద ఆకును చుట్టగా మలిచి ఆ రసాన్ని మింగి తన ఆరోగ్యాన్ని కాపాడుకున్నాడన్నారు. దీన్ని పొగాకుగా యువత అపోహ పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఓఈ అధ్యాపకులు నరేష్ బాబు, ప్రవీణ్, ముత్తయ్య, వెంకట్, అశోక్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రుగొండ : చంద్రుగొండ ఆర్టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న చెరువు కట్టపై గుర్తు తెలియని (57) సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం చెరువు కట్ట వైపు వెళుతున్న కొంతమంది గ్రామస్తులు మృతదేహాన్ని చూసి పోలీసు వారికి సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతని వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించగా అతని జేబులో ఉన్న ఎన్నికల ఓటర్ కార్డ్ ఆధారంగా మృతుడి పేరు కర్రి పాపారావు (57)గా గుర్తించారు. ఇతనిది చుంచుపల్లి మండలం గరిమెళ్ళ పాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అతని వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | జూన్ 01, 2024 | www.navatelangana.com

దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీరాజ్ హైదరాబాద్ వారి చేత దూర విద్యా విధానం ద్వారా పీజీ, డిప్లొమా, ఇన్ రూరల్ డెవలప్మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్మెంట్ మేనేజ్మెంట్, పీజీ డిప్లొమా ఇన్ జియో-స్పెషల్ టెక్నాలజీ అప్లికేషన్ ఇన్ రూరల్ డెవలప్మెంట్, డిప్లొమా ఇన్ పంచాయతీ గవర్నర్స్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల అయినందున అర్హులు, ఆసక్తిగల గిరిజన యువత దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు డిగ్రీ చదువుకున్న వారు జూన్ 15వ తేదీలోగా ఎన్ఐఆర్డీ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోర్సు కాల వ్యవధి 18 నెలలు ఉండగా గిరిజన అభ్యర్థులు దరఖాస్తు ఫీజు రూ.300 చెల్లించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. మిగతా వివరాలకు www.nirdpr.org.in వెబ్సైట్ను సందర్శించగలరని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వివిధ కేటగిరీలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చొరవ తీసుకోవాలని లేబర్ ఆఫీసర్కు ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మణుగూరు సింగరేణిలో వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులైన కోల్ శాంపిల్స్, కార్మికులు, హిందుస్థాన్ కంపెనీ కార్మికులు కనీస వేతనాలు అందక రెండు నెలలుగా శ్రమ చేస్తున్నప్పటికీ, జీతాలు చెల్లించడం లేదని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనబడడం లేదని, అందుకే వారి సమస్యల పరిష్కారం కోసం లేబర్ కమిషనర్కు ఏఐటీయూసీ రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేసింది. కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, ఇల్లెందు, భూపాలపల్లి డివిజన్లలో ఇప్పటికే కోల్ శాంపిల్స్ సమ్మెలో పాల్గొన్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఆదేర్ల సురేందర్, హిందుస్థాన్ కంపెనీ అధ్యక్షులు అవినాష్, కోల్ శాంప్లింగ్ సంఘం అధ్యక్షులు సందీప్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించాలి

- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా

నవతెలంగాణ-జూలూరుపాడు

2024-25 విద్యా సంవత్సరానికి ముందే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా కోరారు. ప్రభుత్వ విద్యా విధానం కోసం అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉన్నందున, వేసవి సెలవులు పూర్తయ్యే లోపుగా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులను పూర్తి చేస్తే 2024 విద్య సంవత్సర విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించడం ద్వారా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులను చేయవచ్చన్నారు.

ఇసుక అక్రమ రవాణా

- రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



మండలంలోని గట్టు మల్ల కొత్తగూడెం రేంజ్ రిజర్వ్ ఫారెస్ట్లో గుట్టు చప్పుడు కాకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఫారెస్ట్ అధికారులు పట్టుకొని సీజ్ చేసి సంబంధిత ఇసుకదారులపై కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఇలాంటి ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్లు సైతం కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అక్రమ ఇసుక రవాణా దారులు మాత్రం అడ్డదారున ఇసుక రవాణా చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్లు, సరైన కాగితాలు లేవని రెండు ట్రాక్టర్లు సీజ్ చేసినట్టు ఎఫ్ఎస్ఓ క్రాంతికుమార్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాక్టర్ పట్టుకున్న వారిలో ఫారెస్ట్ సిబ్బంది ఎఫ్బిఓ రాంబాబు ఉన్నారు.

చెరువు తూము మరమ్మతులకు టెండర్లు నిర్వహించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలో సుమారు రెండు వేల ఎకరాల పంట పొలాలకు నీరు సరఫరా చేస్తున్న రోళ్లపాడు చెరువు తూములకు, కుడి, ఎడమ కాలవలకు టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించాలని సీపీఐ ఎంఎల్ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు శుక్రవారం డిమాండ్ చేశారు. అఖిలభారత రైతుకూలీ సంఘం సంఘాల ఆధ్వర్యంలో తూముల మరమ్మతులు చేపట్టాలని గతంలో ఆందోళనలు చేసిన కారణంగా 7.5 లక్షలు మంజూరయ్యాయని, మంజూరై వారం గడుస్తున్నప్పటికీ టెండర్లు నిర్వహించి పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభం కావస్తుందని అడపా, దడపా వానలకు చెరువు నిండితే నీరు మొత్తం వృధా అయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు గుగులోతు రామచందర్, నాయకులు వెంకట్రామ్, ధరావత్ వెంకన్న, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

నవతెలంగాణ-మణుగూరు

నికిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పగిడేరు, మణుగూరు మున్సిపాలిటీలో విత్తనాల షాపులలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంటీన్ సేవలు అందించాలి

- ఏరియా జీఎంకి టీబీజీకేఎస్ వినతి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఏరియా కొండాపురం భూగర్భ గని నందు సెకండ్ షిఫ్ట్ సమయంలో కార్మిక వర్గానికి క్యాంటిన్ సేవలు అందించాలని కోరుతూ ఏరియా టీబీజీకేఎస్ ఇన్చార్జి నాయకులు నాగెల్లి వెంకట్, యూనియన్ నాయకులు శుక్రవారం ఏరియా ఇన్చార్జి జనరల్ మేనేజర్ లక్ష్మిపతి గౌడ్కి వినతి పత్రాన్ని అందజేశారు. నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సమిష్టి కృషి ద్వారా సాధిస్తున్న మణుగూరు ఏరియా కార్మిక వర్గానికి ఏరియా యాజమాన్య సేవలు ఎప్పటికీ మరువలేనివి అన్నారు. ఖర్చుకు వెనకడుగు వేయకుండా కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిరంతర సేవలు అందిస్తున్న ఏరియా యాజమాన్యంకు ముందుగా మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ తరుపున వారంత హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. గడచిన ఐదు సంవత్సరాల పై బడి కొండాపురం గనికి మొదటి షిఫ్ట్ నందు మాత్రమే ఫ్లీడరు క్యాంటీన్ ద్వారా అల్పాహార సేవలు అందుతున్నాయని యాజమాన్యం అందించిన క్యాంటీన్ సౌకర్యంను ఉపయోగించుకొని కంపెనీ సమయ వేళను పాటిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి కార్మికుడు కష్ట పడి పని చేస్తున్నారని తెలిపారు.

కార్మిక శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం మొదటి షిఫ్ట్ నందు క్యాంటీన్ సౌకర్యం అందిస్తుందో అదే తరహాలో సెకండ్ షిఫ్ట్ నందు ఫ్లీడరు క్యాంటీన్ ద్వారా బూంది, టీ సౌకర్యాన్ని కార్మిక వర్గానికి అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ అధికారి రమేష్ నాయకులు నాగేల్లి వెంకట్, బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వర రావు, ఎర్రపు వినయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి మందిరానికి రెండు లక్షల విరాళం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరానికి రూ.2లక్షల విరాళం అందింది. భద్రాచలం వాస్తవ్యులు పద్మ క్లాత్ స్టోర్స్ గొండేల రత్నకుమారి భర్త లేటు గోండెల వెంకటేశ్వరరావు పేరు మీదుగా వారి మనుమడు, కోడలు కలిసి శ్రీ సాయిబాబా వారికి చేయించనున్న స్వర్ణ సింహాసనమునకు (బంగారు పూతతో) రెండు లక్షల విరాళమును ఆలయ అధ్యక్షులు, కోశాధికారి తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి కుంచాల రమేష్లకు అందజేశారు. అనంతరం దాతలను శాలువాతో సత్కరించి బాబా వారి మేమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు మందరపు నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్సెస్ దేవస్థానం

అధికారుల మధ్య ఆధిపత్య యుద్ధం



పాలకమండలి ఏర్పాటుతోనే వివాదాల పరిష్కారం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన భద్రాచలం దేవస్థానం ఆలయ ఈవోకి రాష్ట్రంలోనే అతిపెద్ద పంచాయతీలలో ఒకటిగా నిలిచిన భద్రాచలం గ్రామపంచాయతీ ఈవోకి మధ్య అంతర్గతంగా ఆదిపత్య యుద్ధం రోజు రోజుకి అంతకంతకు పెరుగుతుంది. గతంలో గ్రామపంచాయతీ వారు భద్రాచలం పట్టణ వ్యాప్తంగా సేకరించిన వ్యర్థాలను రామాలయ సమీపంలోని కరకట్టపై డంపింగ్ చేయడంతో సుదీర్ఘ ప్రాంతాల నుండి రామాలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అట్టి చెత్త దగ్ధం చేయటంలో వచ్చే పొగతో రామాలయ పరిసర ప్రాంతాలు గాలి కలుషితంతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారని భద్రాచలం గ్రామపంచాయతీ ఈవోపై అధికారులకు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా రామాలయ చుట్టు పరిసర ప్రాంతాలలో ఉచిత పార్కింగ్ సౌకర్యం ఉన్నప్పటికీ పంచాయతీ వారు ఆసీలు వసూలు చేస్తున్నారన్న నేపంతో ఆలయ పరిసర ప్రాంతాలలో పార్కింగ్ చేసే వాహనాలకు ఎటువంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని నిర్ణయిస్తూ సర్క్యులర్ను విడుదల చేయడమే కాక రామాలయ పరిసర ప్రాంతాలలో ఉచిత పార్కింగ్ ప్రచార బోర్డులను కూడా పెట్టడంతో పంచాయతీ అధికారులకు, దేవస్థాన అధికారుల మధ్య కోల్డ్ వార్ ప్రారంభమైనది. దేవస్థానం ఈవో రమాదేవి తీసుకుంటున్న నిర్ణయాలతో గ్రామపంచాయతీకి ఆర్థిక నష్టం కలుగుతున్న నేపథ్యంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు కూడా ఒక అడుగు ముందుకేసి రామాలయం చుట్టుపక్కల మాడవీధులలో సిబ్బంది కొరత కారణంతో గ్రామపంచాయతీ వారు శుభ్రం చేయటం సాధ్యం పడదని రామాలయ చుట్టూ ప్రాంతాలను ఆలయ సిబ్బందితోనే శుభ్రపరుచుకోవాలని కోరుతూ దేవస్థానం ఈవో రమాదేవికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. దేవస్థానం ఈవో చేసిన చర్యకి ప్రతి చర్యగా పంచాయతీ ఈవో తీసుకున్న నిర్ణయంతో ఒక్కసారిగా ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య ఆదిపత్య యుద్ధం తారస్థాయికి చేరిందని స్పష్టమవుతుంది. ఇద్దరు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఎవరికి వారే సమర్థించుకున్నప్పటికీ ఈ చర్యలతో ఇటు దేవస్థానం ప్రతిష్ట దిగజారడంతో పాటు అటు గ్రామపంచాయతీ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని స్పష్టమవుతుంది.

ఆ అధికారులు ఇద్దరూ ఇద్దరే...

ఎంతటి సవాల్ నైనా అధిగమిస్తూ చేసే పనిలో చిత్తశుద్ధిని ప్రదర్శిస్తూ అంతర్ కర్మ శుద్ధితో విధులు నిర్వహిస్తూ సామర్థ్యం గల ఇద్దరు అధికారుల మధ్య నెలకొన్న ఆదిపత్య యుద్ధం భద్రాచలం పట్టణంలో విస్తృతంగా చర్చ జరుగుతుంది. ఎన్నో ఆటంకాలు అధికమించి దేవస్థానంలో ప్రక్షాళన ప్రారంభించి అవినీతి అధికారుల భరతం పట్టడమే కాక రామాలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఈవో రమాదేవికి అదే స్థాయిలో రాష్ట్రంలోనే భద్రాచలం గ్రామపంచాయతీని ఆదర్శంగా నిలపడంతో పాటు విధినిర్వహణలో ఎటువంటి రాజీ పడని ఈవో శ్రీనివాసరావుల మధ్య నెలకొన్న వివాదాలను ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని ఇద్దరు సమర్థవంతమైన అధికారుల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని కిందిస్థాయి ఉద్యోగులు కోరుతున్నారు. విధి నిర్వహణలో చూపిస్తున్న చిత్తశుద్ధితో ఇద్దరు అధికారులు కూడా భద్రాచల ప్రజల మన్నెలు పొందిన విషయం తెలిసిందే.

పాలకమండలి లేకపోవడం వివాదాలకు కారణం..?

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆలయానికి పాలకమండలి లేకపోవడం అదే స్థాయిలో రాష్ట్రంలోనే అతిపెద్ద పంచాయతీగా పేరుపొందిన భద్రాచలం పంచాయతీకి సైతం గత ఆరు సంవత్సరాల నుండి పాలకమండలి లేకపోవడంతోనే అధికారుల మధ్య ఆదిపత్య యుద్ధం నడుస్తుందని తెలుస్తుంది. దేవస్థానానికి అదేవిధంగా గ్రామపంచాయతీకి పాలకమండలు ఏర్పడితే రాజకీయ జోక్యంతో ఇటువంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సుదీర్ఘకాలం పాటు పంచాయతీకి గాని ఇటు దేవస్థానానికి గాని పాలకమండలిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపని ఫలితంగానే ఇటువంటి వివాదాలు తలెత్తుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని ఇటు దేవస్థానానికి పాలకమండలిని ఏర్పాటు చేయడంతో పాటు భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీకి వెంటనే ఎన్నికలు నిర్వహించి ఇటువంటి సమస్యలు జఠిలం కాకుండా చూడాలని భద్రాచల రాజకీయ ప్రముఖులు కోరుతున్నారు.

సింగరేణి సివిల్ రైల్వే కర్మికులకు రెస్ట్ షెల్టర్ నిర్మించాలి

నవతెలంగాణ-మణుగూరు



కూనవరం రైల్వే గేట్ సమీపంలో సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు రెస్ట్ షెల్టర్ నిర్మించాలని ఐఎఫ్టీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు సివిల్ అధికారి డీవైఎస్ ఈ పాత్రుడుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ ఏరియా సివిల్ తోగ్గుడెం రైల్వే స్టేషన్ నుండి కేసీఎస్పీ వరకు గల 16 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు 26 సంవత్సరాలుగా 24 మంది కాంట్రాక్ట్ కార్మికులు బొగ్గు రవాణాకు ఎటువంటి అంతరాయం కలగకుండా సివిల్ విభాగం ఆధ్వర్యంలో రక్షణ సూత్రాలు పాటిస్తూ పని చేస్తున్నట్టు తెలిపారు. వీరి ఇబ్బందిని గుర్తించి రెస్ట్ షెల్టర్ నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు వి.శంకర్, టి.రామకృష్ణ, ఎం.హౌసింగ్, ఉప్పల శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి

- ఐటీడీఏ పీవో ప్రతిక్ జైన్

నవతెలంగాణ భద్రాచలం రూరల్



రహదారి సౌకర్యం లేని దట్టమైన అటవీ ప్రాంతంలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలలో చీకటిని పారదోలి వెలుగును ప్రసాదించడానికి ఆ గ్రామంలోని కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో అశ్వరావుపేట మండలంలోని వాగోడ్డు గూడెం నారాయణపురం గ్రామాలలోని గిరిజనులు వారి కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు పీఓకు కృతజ్ఞత తెలియజేయడానికి వచ్చి వారి మనసులోని ఆనందాన్ని తెలియజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేక గిరిజన రైతులు, గిరిజన కుటుంబాలు అవస్థలు పడుతుండేవారని, వారి గ్రామాల సమస్య నా దృష్టికి రాగానే విద్యుత్ సౌకర్యం కల్పించడానికి సమస్య దేని వలన వస్తుందో తెలుసుకొని పరిష్కరించినట్టు తెలిపారు. ముఖ్యంగా ఫారెస్ట్ అధికారుల వలన ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వడం లేదని తెలిసి ఫారెస్ట్ వారికి ఇబ్బందులు లేకుండా ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అనుమతులు తీసుకొని రూ.11 లక్షల వ్యయంతో ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. గతం లో ఆ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కోసం గిరిజనులు కొంత డబ్బు చెల్లించిన ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇవ్వకపో వడంతో విద్యుత్ సౌకర్యం కల్పించలేదని ఆయన అన్నారు. వాగోడ్డుగూడెం గ్రామంలో 50 ఆదివాసీ కుటుంబాలు, నారాయణపురం గ్రామంలో 25 ఆదివాసీ కుటుంబాలు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారి గ్రామాలకు కరెంటు పోల్, ప్రతి ఇంటికి కరెంటు మీటర్తో సహా వారికి నయా పైసా ఖర్చు కాకుండా ప్రతి కుటుంబానికి విద్యుత్ సౌకర్యం కల్పించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పవర్ మునీర్ పాషా, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు

- గంటా రాధా సేవలు చరిత్రలో నిలిచిపోతాయి
- త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి



నవతెలంగాణ-మణుగూరు

దానధర్మ ట్రస్ట్ చైర్పర్సన్ గంటా రాధా ఆధ్వర్యంలో 165 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. అన్నారం గ్రామంలో పది ఎకరాల స్థలంలో పచ్చటి తోరణాలు, పందిళ్ల కింద వివాహాలు నిర్వహించినట్టు గంట రాధా తెలిపారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి వారి సమక్షంలో దేవనాద్ జీయర్ స్వామి అహెూబిలం, జీయర్ స్వామి పాల్గొన్నారు. మేళతాళాలతో సాంప్రదాయబద్ధంగా వివాహాలు నిర్వహించారు. ప్రతి జంటకు తాళి, మెట్టెలు, పట్టు వస్త్రాలు అందజేశారు. జంటతో వచ్చిన పెద్దలకు, గ్రామస్తులకు పరిసర ప్రాంతాల 10 వేల ప్రజలకు అన్నదానం నిర్వహించారు. వేసవిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరికీ అందుబాటులో మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మణుగూరు సబ్ డివిజన్లోని అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 165 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు జరిపించినట్టు ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమానికి దాన ధర్మ ట్రస్ట్కు వికాస తరంగణి సహకారం అందించారు. నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు, మంగళసూత్రం, మెట్టెలు, శ్రీ రామచంద్ర మూర్తి ప్రతిమను ఉచితంగా అందించామన్నారు. ఈ సామూహిక కల్యాణ క్రతవును చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిపించారు. ఆదివాసీలకు హిందూ సంప్రదాయం తెలుసుకోవాలని, అలాగే రాముల వారి వనవాసంలో ఆదివాసీలు సహాయం చేసారని ఆయన అన్నారు. మాములుగా వివాహాల్లో జరిగే తంతుతో పాటు వధువుతో వరుని మెడలో రామచంద్రుని ప్రతిమను కట్టించారు. వివాహ అనంతరం వివాహ మంగళ శాసనం చదివి వినిపించారు. స్వయంగా చిన్న జీయర్ స్వామి ప్రతి జంటను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ...ఆదివాసీ గ్రామాల్లోని ప్రజలకు దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. ఆకలితో ఉన్నవారికి ఆహార పొట్లం అందజేయడం, దిక్కులేని వారికి అండగా నిలబడి బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయడం గొప్ప విషయం అన్నారు. ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించి హిందు సాంప్రదాయం తెలియచేయాలని, గత మూడు రోజులుగా ఆహారం తీసుకోకుండా మంచీ నీళ్లు తీసుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిచారని, 165 జంటలకు కల్యాణానికి ఒక్కొక జంటకు సుమారు రూ.60 వేలు ఖర్చు వచ్చిందని తెలిపారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఛత్తీస్గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మూడు రాష్ట్రాల నుండి 165 కుటుంబాలకు చెందిన వారు పాల్గొన్నట్టు రాధ తెలిపారు. సహకరించిన చిన్న జీయర్ స్వామివారికి, పెద్దలకు, గ్రామస్తులకు, ట్రస్ట్ సభ్యులకు, పోలీస్, మున్సిపల్ సిబ్బంది, అధికారులకు, సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తు కాలంలో చేయబోయే సేవా కార్యక్రమాలకు ఇలానే సహకారం అందించాలని తెలిపారు.



హనుమత్ జయంతికి ఏర్పాట్లు సిద్ధం

నవతెలంగాణ-దమ్మపేట



మండల కేంద్రంలో జీసీసీ ఆవరణ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ విజయ మహాగణపతి శ్రీ మర్రి భక్తాంజనేయ స్వామి దేవాలయ మందిరాలలో శనివారం హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నట్టు మందిరాల స్థానాధిపతి చామర్తి సాయి ప్రసాద్ శాస్త్రి శుక్రవారం తెలిపారు. జీసీసీ మేనేజర్ సుగ్గల నరసింహారావు, అకౌంటెంట్ యార్లగడ్డ పోలారావు, జీసీసీ హమాలి వర్కర్స్ యూనియన్ భోగం సత్యం, మర్రి భక్తాంజనేయ స్వామి భక్త కమిటీ మాడా హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 8:30 నుండి 11 గంటల 30 నిమిషాల వరకు స్వామివారికి విశేష ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినున్నట్టు తెలిపారు. 5 వేల నాగవల్లి దళ పత్రాలతో విశేష అర్చన, సహస్ర కుముద పుష్పాలతో పరాశర సంహిత విధానంలో మర్రిభక్తాంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ఎటువంటి రుసుము చెల్లించకుండా పూజా క్రతువుల్లో పాల్గొనవచ్చు అని, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు హనుమాన్ శోభాయాత్ర మందిరాల వద్ద నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనవచ్చని తెలియజేశారు.



గుట్కా, పాన్ మసాలాల నిషేధం పట్ల హర్షం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గుట్కా, పాన్ మసాల విక్రయాలపై తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా మాజీ చైర్మన్ కనుబుద్ది దేవా శుక్రవారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డా.దాసరి హరి చందన ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వీటి తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, అమ్మకాలపై పూర్తి స్థాయిలో నిషేధం విధించడం పట్ల ప్రజల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతుందని అన్నారు.

సీతారామ కాలువలో పడి వృద్ధురాలు మృతి

అశ్వాపురం సీతారామ కాలువలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... అమెర్ధ గ్రామానికి చెందిన షేక్ కత్తి జాజి (85) వృద్ధురాలు గురువారం అమెర్ధ నుండి అమెర్ధ కాలనీలో ఉంటున్న ఆమె కుమారుడైన దస్తగిరి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో వాళ్లు ఉపాధి పనులకు వెళ్లడంతో ఇంట్లో ఉన్న ఆమె మనమరాలు చాయి పెట్టి ఇవ్వడంతో తాగి మరల తాను ఇంటికి వెళ్తానని తిరుగు ప్రయాణం అయింది. సాయంత్రం అయినా అమెర్ధ కూడా వెళ్లకపోవడంతో దస్తగిరి కుటుంబంతో పాటు ఆయన తమ్ముడు కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సీతారామ కాలువలో మృతదేహం ఉండటానికి గమనించిన స్థానికులు వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో హుటాహుటిన కాలువ వద్దకు వెళ్లి మృతదేవాన్ని బయటకు తీశారు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు దస్తగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ఆటో పల్టీ

ప్రయాణికులకు స్వల్ప గాయాలు

నవతెలంగాణ- దుమ్ముగూడెం:

ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టిన సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం భద్రాచలం- చర్ల ప్రధాన రహదారి బైరాగులపాడు గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం లక్ష్మీ నగరం నుండి చర్ల వైపు ప్రయాణికులతో వస్తున్న బజాజ్ ఆటోకు ఎదురుగా ఒక్కసారి గేదెలు అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ వాటిని తప్పించే క్రమంలో ఆటో గేదెలకు తగిలి రహదారి కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న బైరాగులపాడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు కాగా, జెడ్ వీరభద్రపురం గ్రామానికి చెందిన మల్లం నాగమ్మకు తలభాగంలో బలమైన దెబ్బ తగిలింది. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి 108 వాహనానికి సమాచారం అందజేశారు.

పేకాట స్థావరం పై దాడి : ఏడుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ -పాల్వంచ రూరల్

జగన్నాథపురంలో పేకాట స్థావరంపై శుక్రవారం గ్రామీణ పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులో గుగులోతు చందులాల్, మాలోత్ బాబురావు, ధర్మ సోత్ శ్రీరామ్, శివకుమార్, జి కార్తీక్, సతీష్, శివకుమార్ లు పేకాట ఆడుతుండగా.. నిర్దిష్ట సమాచారం మేరకు చందులాల్, బాబురావు లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురు పరారయ్యారు. వీరి వద్ద నుండి రూ.3400లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో గ్రామీణ ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కామేపల్లి వాసి శివకృష్ణకి డాక్టరేట్

- జంతు శాస్త్ర విభాగంలో అందిన పురస్కారం
- అంగవైకల్యం చదువుకు అడ్డు కాదని నిరూపించాడు

నవతెలంగాణ-కామేపల్లి

కాకతీయ విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్ర విభాగనికి చెందిన పూజల శివకృష్ణకు డాక్టరేట్ ప్రకటించినట్టు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. నరసింహచారి తెలిపారు. మండల కేంద్రమైన కామేపల్లి గ్రామానికి చెందిన పూజల శివకృష్ణ పుట్టుకతోనే అంగవైకల్యం కలిగి ఉన్నాడు. అయినప్పటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ మొక్కవోని దీక్షతో కష్టపడి చదువుతూ అంగవైకల్యాన్ని జయించి డాక్టర్ పట్టా సాధించాడు. ఆచార్యులు డాక్టర్ ఇస్తారి మామిడాల పర్యవేక్షణలో "ఇన్ విట్రో అండ్ ఇన్ సిలికో హైపోగ్లిసెమిక్ ఎఫెక్ట్ ఆఫ్ ఫైటో కెమికల్స్ ఐసోలాటెడ్ ఫ్రొమ్ ది లీవ్స్ ఆఫ్ కాస్ట్యూస్ ఇగ్నేయస్"అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో పబ్లికేషన్స్ చేశారు. దీంతో శివ కృష్ణకు డాక్టరేట్ కల సహకరమైంది. ఈ సందర్భంగా డాక్టరేట్ సాధించిన శివకృష్ణని పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, తోటి పరిశోధకులు, స్నేహితులు గ్రామస్థులు అభినందించారు. పేదరికంలోనూ వైకల్యాన్ని జయిస్తూ డాక్టరేట్ సాధించడం పట్ల పలువురు ఆచార్యులు తోటి పరిశోధకులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ ప్రోత్సహించిన తల్లి సోదరుడు సతీష్ కుమార్‌కు తనకు సహాయ సహకారాలు అందించిన ఆచార్యులు మామిడాలకు పరిశోధకులకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని గువ్వలగూడెం గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. రాజమండ్రి నుండి మిర్యాలగూడానికి పనసకాయల లోడుతూ వెళుతున్న టాటా డీసీఎం గువ్వలగూడెం గ్రామం వద్దకు రాగానే రోడ్డు దిగే క్రమంలో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మిర్యాలగూడకు చెందిన దొండ నాగరాజు(38), వై ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దొండ నాగరాజు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారం రోజుల పాటు ఉచిత మజ్జిగ పంపిణీ పొడిగింపు

నవతెలంగాణ-కల్లూరు

దాతల సహకారంతో కల్లూరు బస్టాండులో చేపట్టిన 60 రోజుల ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసిందని, ఈ కార్యక్రమాన్ని మరో వారం రోజులకు పొడిగించినట్టు టీం సత్తుపల్లి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కానీ ఎండలు అధికంగా ఉండుట, భానుడి భగభగలతో ప్రయాణికులు ఉక్కపోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న వేళ దాతల సూచనతో మరో వారం రోజులపాటు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని పొడిగించాలని భావించినట్టు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు.

కారేపల్లి బంక్ డిజిల్‌లో నీళ్లు

- బంక్ ఎదుట రైతుల ఆందోళన

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లిలోని పెట్రోల్ బంక్‌లో డీజిల్‌లో నీళ్ల కల్తీ జరిగిందంటూ శుక్రవారం రాత్రి డీజిల్ కొనుగోలుదారులు ఆందోళన చేసిన ఘటన చోటు చేసుకుంది. మాధారంకు చెందిన గుగులోత్ కృష్ణ తన జెసిబిలో డీజిల్ కొట్టించుకోవడంతోపాటు క్యాన్లలో కూడా డీజిల్ పోయించుకున్నాడు. జెసిబి నడుస్తూ నడుస్తూ ఆగిపోవడంతో డిజిల్ అయిపోయిందని మరికొంత డిజిల్ నుండి వస్తుండగా డీజిల్ బదులుగా నీళ్ల కనిపించాయి. దీంతో జెసిబి నడవకుండా ఉండటానికి కారణం కల్తీ డిజిల్ అని తెలిసి బాధితుడు కారేపల్లి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని బంకు యాజమాన్యాన్ని నిలదీశాడు. ఇతనితోపాటు మరికొందరు కూడా డీజిల్ పోయించుకున్న వాళ్ళు డీజిల్‌లో కూడా కల్తీ జరిగిందంటూ పెట్రోల్ బంక్ వద్ద ఆందోళనకు దిగారు. తాను క్యాన్లలో కొనుగోలు చేసిన డీజిల్ ను బకెట్‌లో పోయగా దానిలో నీళ్ల కనిపించాయి. దీంతో కొందరు డిజిల్ కొనుగోలు దార్లకు యాజమాన్యం తిరిగి డబ్బులు ఇచ్చివేసింది. డిజిల్‌లో కల్తీ ఎలా జరిగిందో తెలియటం లేదని దీనిపై విచారిస్తామని బంక్ యాజమాన్యం తెలిపింది.

యువత ఆరోగ్యాలు నాశనం చేసుకోవద్దు

ప్రిన్సిపల్ కే వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - పాల్వంచ రూరల్

యువత స్టైల్ కోసమో... మత్తు కోసమో... స్నేహితులు, కుటుంబీకులు తాగుతున్నారని.. యువత మత్తుకు బానిసై ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (సీఓఈ) ప్రధాన ఆచార్యులు డాక్టర్ కే వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ధూమపానానికి అలవాటై విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రధాన చార్యుడు కే వెంకటేశ్వర్లుతోపాటు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఆనంద్ లు అన్నారు. పాల్వంచ సీఓఈ లో శుక్రవారం పరీక్షలకు హాజరైన విద్యార్థులతో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పొగాకు సేవించి అనారోగ్యం బారిన పడకుండా చైతన్యం చేశారు. విప్లవకారుడు చేగువేరా నోటిలో ఉన్నది సిగరెట్ అనుకొని కొందరు అపోహ పడుతున్నారని, ఆయనకు ఆస్తమా వ్యాధి ఉండడంతో ఒక ఆయుర్వేద ఆకును చుట్టగా మలిచి ఆ రసాన్ని మింగి తన ఆరోగ్యాన్ని కాపాడుకున్నాడన్నారు. దీన్ని పొగాకుగా యువత అపోహ పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఓఈ అధ్యాపకులు నరేష్ బాబు, ప్రవీణ్, ముత్తయ్య, వెంకట్ ,అశోక్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మధిరలో కాంగ్రెస్ అభ్యర్థికి మెజార్టీ పెరిగేనా?



- అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ పార్లమెంట్ ఎన్నికల్లో వస్తుందా?
- రాజకీయ పార్టీల్లో తర్జన భర్జనలు

నవతెలంగాణ-బోనకల్

ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం), సీపీఐ మద్దతుతో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డికి ఏ స్థాయిలో మెజార్టీ వస్తుంది.. వస్తే ఎంత వస్తుంది? అనేది రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ కొనసాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి మధిర నియోజకవర్గంలో 35వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఆ మెజార్టీ వస్తుందా? లేదా? అనేది రాజకీయ వర్గాల్లో ముమ్మరంగా చర్చలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం సీపీఐ మాత్రమే కాంగ్రెస్ కి మద్దతు ప్రకటించింది. ఈ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ(ఎం) అదనంగా మద్దతు ప్రకటించింది. దీంతో గతంలో కంటే కాంగ్రెస్ అభ్యర్థికి అదనంగా మెజార్టీ రావాల్సి ఉంది. నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గం బలంగా ఉంది. వారికి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక స్థానం కూడా కేటాయించకపోవడంతో ఆ సామాజిక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్ల కొంత అసంతృప్తికి గురై నామ నాగేశ్వరావుకి ఓట్లు వేసినట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి కొంత మెజార్టీ తగ్గుతుందేమోనని ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అంతర్గతంగా తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించింది. పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావుకి మద్దతు ప్రకటించింది. అంతేకాకుండా స్థానికంగా మల్లు నందినికి ఎంపీ టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు కొంత నిరుత్సాహానికి గురైనా, స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాత్రం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం





విస్తృతంగా ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావుకి ఎమ్మార్పీఎస్, తెలుగుదేశం మద్దతు ఉండటంతో ఆ పార్టీ కూడా నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో ఓట్లు సాధిస్తారని ప్రచారం సాగుతోంది. ఒకరకంగా మధిర నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ కొంత బలంగానే ఉంది. గతంలో మధిర నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ పోటీ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మాదిగలు తాండ్ర వినోద రావుకి ఓట్లు వేసినట్లు ప్రచారం. మధిర నియోజకవర్గంలో మొత్తం 2,22, 160 ఓట్లు ఉండగా వాటిలో 1,81, 815 ఓట్లు పోలయ్యాయి. రెడ్డి సామాజిక వర్గం బలంగా ఉన్న ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్ అభ్యర్థికి భారీ స్థాయిలో మెజార్టీ వస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. నామ నాగేశ్వరరావుకు మాత్రం గత పార్లమెంటు ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో నుండి భారీ మెజార్టీ వచ్చిందని, ఈసారి కూడా మధిర నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు భారీ మెజార్టీ వస్తుందని నామ నాగేశ్వరావు ధీమాలో ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు అంటున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు మెజార్టీ తమకంటే, తమకే అంటూ రెండు పార్టీలు లెక్కల్లో మునిగిపోయారు. మరో నాలుగు రోజుల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానంలో గెలుపు ఎవరిదో తెలిసిపోనుంది. అంతేకాకుండా మధిర నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో కూడా తేటతెల్లం కానుంది. ఇది ఇలా ఉండగా పార్లమెంట్ అభ్యర్థిగా రామ సహాయం రఘురామిరెడ్డి విజయం సాధిస్తారని విషయాన్ని అంతర్గతంగా బీఆర్ఎస్ నాయకులు సైతం అంగీకరిస్తున్నారు. కాంగ్రెస్ మెజార్టీ ఒక లక్ష యాభై వేలు అంచనా వేస్తున్నప్పటికీ 75 నుంచి లక్ష లోపు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కలు కూడా నాలుగు రోజుల్లో తేలనున్నది. మధిర నియోజకవర్గంలోనే ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలు ఉండగా బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో గత అసెంబ్లీ ఎన్నికల కంటే మెజార్టీ పెరుగుతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రూరల్ మండలంలో శనివారం పర్యటించనున్నారని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మండలంలోని సత్యనారాయణపురం, ఏదులాపురం, గొల్లగూడెం, బారుగూడెం, కొండాపురం, తల్లంపాడు, పొన్నెకల్, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ళ, నంద్యతండా, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు నేరుగా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.



ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ఎస్‌కు సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం

ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ ఎండీ.గౌష్ పాషాను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. రిటైర్ మెంట్ తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదని, మీ విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను కృతజ్ఞతలు తెలిపారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. శాఖపరంగా రావలసిన బెనిఫిట్స్ త్వరితగతిన అందిచేలా చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ వేంకటేశ్వర్లు, మోహన్ రావు, పంతులు, ఏఆర్ఎస్ఐ సంగయ్య పాల్గొన్నారు.

సయ్యద్ షమీమ్ మృతికి నివాళి

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని పుల్లయ్య బంజార్ రోడ్డులో నివాసం ఉంటున్న సయ్యద్ జానీ భార్య సయ్యద్ షమీమ్ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. జానీ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భూక్యా శివకుమార్ నాయక్, సేవాదళ్ అధ్యక్షులు పాపబత్తిని నగేష్, సత్తుపల్లి బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆళ్లకుంట నరసింహారావు, షేక్ తురబ్ అలీ, షేక్ ఉస్మాన్, పెద్దబోయిన శ్రీనివాసరావు, మట్ట రామకృష్ణ, విజయరావు, బాబురావు, బొల్లం రామారావు, మండల యువజన నాయకులు భానోత్ వంశీ, నందా నాయక్, కాంగ్రెస్ కల్లూరు మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిని రామడుగు వాణి మాట్లాడుతూ రైతులందరూ విత్తనాలను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుండి మాత్రమే తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనుమతి లేకుండా విత్తనాలను విక్రయిస్తున్నట్లయితే అటువంటి సమాచారాన్ని వెంటనే మండల వ్యవసాయ అధికారికి లేదా పోలీసుశాఖ వారికి తెలియజేయాలని సూచించారు. రైతులు విత్తనాలు కొన్న బిల్లును, ఖాళీ ప్యాకెట్లను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా పత్తి గింజలు విత్తుకోవాలంటే తగిన వర్షపాతం అనగా 60 మిల్లీమీటర్ల వర్షపాతం వచ్చిన తర్వాత మాత్రమే పత్తి గింజలను విత్తుకోవాలని లేదంటే భూమిలోని వేడికి గింజలు సరిగా మొలకెత్తవని సూచించారు. అనంతరం పచ్చి రొట్టె ఎరువుల వలన కలిగే ప్రయోజనాలు, వరి పత్తి మరియు మిరప సాగులో మెళకువలు, ఎరువుల యజమాన్యం మొదలగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వంశికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఎరుపాలెం నుండి రేమిడిచర్ల వైపు వెళ్లే రోడ్డు మార్గంలో గల వైన్ షాప్ సమీపంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు ఎర్రుపాలెం నుండి రేమడిచర్ల వెళ్లే రహదారిలో వైన్ షాప్ సమీపంలో పొలంలోని ఒక చెట్టు కింద వ్యక్తి మృత దేహం ఉన్నదని పోలీసులకు సమాచారం అందటంతో సంఘటన స్థలానికి ఎస్సై వెళ్లారు. చూడగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఎన్టీఆర్ జిల్లా జయంతి గ్రామానికి చెందిన ప డిగల శ్రీనివాసరావు (55) అనే వ్యక్తి మృతి చెంది ఉన్నాడని తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారని కుమారుడు పడిగల ఆంజనేయులు తన తండ్రి మృతిపై జయంతి గ్రామానికి చెందిన భీమిరెడ్డి నరేందర్ రెడ్డి, గుణ్ణం వెంకటరెడ్డి లపై అనుమానం ఉన్నదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీడీపీఓ కృష్ణ కుమారి సేవలు అమోఘం

ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి రాంగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధి ఎన్ఎస్‌పీలో గల మండల సీడీపీఓ కార్యాలయంలో మండల సీడీపీఓ కర్ణం కృష్ణ కుమారి శుక్రవారం పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా, ఐసీడీఎస్ ఖమ్మం జిల్లా ప్రాజెక్ట్ అధికారి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంత కాలం కర్ణం కృష్ణ కుమారి మండలానికి చేసిన సేవలు అమోఘం అని ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం వారు, వారితో పాటు ఐసీడిఎస్ ఏసీడీపీఓలు ఐసీడిఎస్ కార్యకర్తలు ఆయాలు కృష్ణ కుమారికి జ్ఞాపికను ఆమెకు బహుకరించారు. అనంతరం ఆమెకు ప్రతీ ఒక్కరూ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఏసీడీపీఓలు, మండల ఐసీడిఎస్ సూపర్ వైజర్స్ సుజాత, మహాలక్ష్మీ విజయలక్ష్మీ మధులత, భవాని, సత్యావతి, అభిమున్నిసా బేగం రోజా, యూడిఎస్ శివరామకృష్ణ, మండల ఐసీడిఎస్ కార్యకర్తలు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

నవతెలంగాణ-ఖమ్మం



ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డీ. మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్ పెండింగ్ పై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్లైన్ అప్లోడ్ ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. తహశీల్దార్లు ఫిజికల్ ధరణి ఫైళ్లను అప్లోడ్ చేస్తే, ఆర్డీవోల లాగిన్‌కు వస్తాయని, ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారం పూర్తి చేయాలన్నారు. జూన్ 7న జిల్లా కలెక్టర్, ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్‌లైన్, పెండింగ్ రిజిస్ట్రేషన్ స్లాట్ల పై సమీక్ష నిర్వహించనున్నారని, ఆలోగా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీరయ్య

నవతెలంగాణ-ఎర్రుపాలెం



ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు మండల కమిటీ సమావేశాన్ని షేక్ నాగుల మీరా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ రైతులందరికీ సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలు అమ్మకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు పరుస్తామని, ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీని ఒకే దపా అమలు పర చాలని, రైతుబంధు రైతులందరికీ జూన్ నెలలోనే పెట్టుబడి సాయం అందించాలన్నారు. రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, ఇల్లు, ఇళ్ల స్థలాలు, తదితర ప్రజా సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు హనుమంతరావు, గామాసు జోగయ్య, ఆంగోతు వెంకటేశ్వర్లు, మేడగాని తిరుపతిరావు, దూదిగం బసవయ్య, కోటి సు బ్బారెడ్డి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో 'రఘోత్తముడు'



- విద్యుత్ శాఖలో 32 ఏళ్ల పాటు ఉత్తమ సేవలు
- ఉద్యోగ విరమణ సందర్భంగా ఏఏఈ రఘోత్తంరెడ్డికి ఎస్ఈ సురేందర్, ఉద్యోగుల సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం

విధి నిర్వహణలో రఘోత్తమ్ రెడ్డి సేవలు ప్రశంసనీయమని విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్ అన్నారు. ఖమ్మంలోని విద్యుత్ శాఖ అతిథి గృహంలో అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఏఈ) చల్లా రఘోత్తమ్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సమావేశంలో ఎస్ఈ మాట్లాడారు. 32 సంవత్సరాల పాటు విద్యుత్ శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించారని ప్రశంసించారు. ప్రస్తుతం సత్తుపల్లి ఆపరేషన్ ఏఏఈగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న రఘోత్తమ్ రెడ్డి భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. విద్యుత్ శాఖ ఉద్యోగిగా ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణం స్పందించే గుణం కలిగిన ఉద్యోగిగా రఘోత్తం రెడ్డి అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారని పేర్కొన్నారు. వయస్సు రీత్యా విరమణ పొందినా విద్యుత్ శాఖతో ఆయన అనుబంధం మునుముందు కూడా కొనసాగుతుందని ఆకాంక్షించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ తరఫున జ్ఞాపికను అందజేశారు. రఘోత్తమ్ రెడ్డి- మంజుల దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈ బాబూరావు, కమర్షియల్ డిఈ హిరాలాల్, ఏడిఈ సుధాకర్ రెడ్డి, ఏడిలు కిరణ్ చక్రవర్తి, నాగమల్లేశ్వరరావు, ఏఈ ప్రసాద్, 327 ఐఎన్టీయుసీ జిల్లా అధ్యక్షులు మందపాటి సత్యనారాయణ రెడ్డి, 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శేషగిరిరావు, కూసుమంచి ఎంపీపీ శ్రీనివాస్, కొణిజర్ల సిపిఎం మండల కార్యదర్శి తాళ్లపల్లి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గోపాలరావు, కుటుంబ సభ్యులు భార్య మంజుల, కుమారుడు చల్లా తరుణ్ రెడ్డి, కుమార్తె శ్రీనిజ, అల్లుడు మూల కృష్ణ కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

